సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం। 21। ఆగస్టు। 2023



విద్యుత్ సరఫరా నిరంతరాయం

ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా ఆ శాఖ సిబ్బంది వెంటనే రిపేర్ చేసేలా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	- రూ.60,210
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	- రూ.5,407
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,569
నవర (8 గ్రా)	- రూ.44,552

గరిష్టం/కనిష్టం
37.0 /27.0

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 43 శాతం ఉంది. సోమవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పోర్టులో భారీగా బొగ్గు దిగుమతి



పోర్టులో లంగరు వేసిన నౌకలు

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నంపోర్టు ద్వారా పెద్ద ఎత్తున బొగ్గు దిగుమతి జరుగుతున్నట్టు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా లైలా నాంటోంగ్ అనే నౌక నుంచి 1.27 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి చేస్తున్నారు. అలాగే, డక్కన్ ఫ్రైడ్ అనే నౌక ద్వారా 74,220 టన్నులు, ఎనేస్ అనే నౌక నుంచి 77,450 టన్నుల బొగ్గు దిగుమతి చేస్తున్నారు. మరో వైపు 75,000 టన్నుల బొగ్గు దిగుమతి చేసేందుకు రూబీ స్టార్ అనే నౌక నిరీక్షణలో ఉన్నట్టు వెల్లడించారు.

వెంకయ్యస్వామికి హనుమంతసేవ



హనుమంతసేవలో వెంకయ్యస్వామి

వెంకటాచలం: గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో పూజల అనంతరం హనుమంత వాహనంపై వెంకయ్యస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ట్రాక్టర్‌పై ఆసీనులను చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగవైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. హనుమంత వాహనసేవకు ఇందుకూరుపేటకు చెందిన సూదలగుంట నాగార్జునరావు, ప్రేమలత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే రాత్రి హంసవాహన సేవ నేత్రపర్వంగా సాగింది. ఈ ఉత్సవానికి మోచర్ల మధు(ఈదూరు), ఉప్పల మోహన్(వరిగొండ), నల్లగుండ్ల గాంధీ(తెల్లపాడు) ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్వామివారికి సోమవారం ఉదయం చినశేషవాహనసేవ, రాత్రి గజవాహనసేవ నిర్వహించనున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు



నూతన కమిటీతో ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు(బృందావనం): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సభ్యుల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అమ్మవారి సన్నిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్, ఆ దేవస్థానం పాలకమండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం 2023–2026 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం అమ్మవారి సన్నిధిలో జరిగిందని తెలిపారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా శ్రీరాంసురేష్, ఉపాధ్యక్షుడిగా పేర్ల జనార్దన్, కోశాధికారిగా వొమ్మిన మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సోమిశెట్టి రమేష్‌బాబు, సహాయ కార్యదర్శిగా కోట రమేష్‌బాబు, ప్రత్యేక ఆహ్వానితులుగా చందోలు సునీల్, బైసాని జ్యోతిప్రసాదు, కమిటీ సభ్యులుగా మేడ కామేశ్వరరావు, ఆర్వేటి ఫణీంద్ర, కనమర్లపూడి కల్యాణి, బొండా వెంకటరాజగోపాల్ ప్రమాణ స్వీకారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ మాజీ అధ్యక్షుడు సుంకు మనోహర్, కోశాధికారి పబ్బిసెట్టి శ్రీనివాసులు, కార్యదర్శి ఐతా రామచంద్రరావు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, మాజీ అధ్యక్షుడు కోట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపపోరులో విజయకేతనం



ఎన్నికలు ఏవైనా ఓటర్లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకే పట్టం కడుతున్నారు. జిల్లాలో జరిగిన పంచాయతీ ఉపపోరులో అధికారపార్టీ మద్దతుదారులే అత్యధిక స్థానాల్లో గెలుపొంది విజయఢంకా మోగించారు. కాగా టీడీపీ మద్దతుదారులు అతి తక్కువ స్థానాలను మాత్రమే దక్కించుకోగలిగారు.

- వార్డు, సర్పంచ్ ఎన్నికల్లో సత్తాచాటిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు
- ఒక సర్పంచ్ స్థానం ఏకగ్రీవం
- 61 వార్డుల్లో 49 స్థానాల్లో అధికారపార్టీ మద్దతుదారుల విజయం
- కేవలం 12 స్థానాలకే పరిమితమైన టీడీపీ సానుభూతిపరులు



ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి సర్పంచ్‌గా డిక్లరేషన్ అందుకుంటున్న చేరెడ్డి ప్రభావతమ్మ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో గ్రామ పంచాయతీల వార్డు, సర్పంచ్ పదవులకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయబావుటా ఎగురవేశారు. వివిధ కారణాలతో జిల్లాలో రెండు సర్పంచ్‌లు, 63 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో రెండు వార్డులకు నామినేషన్లు దాఖలు కాకపోవడంతో 61 వార్డులకు మాత్రమే ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అందులో ఒక సర్పంచ్ స్థానంతోపాటు 50 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 11 వార్డులకు, ఒక సర్పంచ్ స్థానానికి మాత్రమే ఎన్నికలు జరిగాయి. అల్లూరు మండలంలోని ఇస్కపల్లిలో రెండు వార్డులకు నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఆ రెండు స్థానాలకు ఎన్నికలు వాయిదా పడ్డాయి.

ఉప పోరు ఇలా..

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలకు, 63 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 6 తేదీన జారీ చేశారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. 11వ తేదీ నామినేషన్లు పరిశీలన చేశారు. 12, 13 తేదీల్లో అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారు. 14వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అదే రోజు తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేశారు. ఒక సర్పంచ్, 50 వార్డుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన ఒక సర్పంచ్ స్థానంతోపాటు 11 వార్డులకు ఈ నెల 19వ తేదీన పోలింగ్ నిర్వహించారు. అదేరోజు సాయంత్రం ఫలితాలను విడుదల చేశారు.

వైఎస్సార్‌సీపీదే హవా

జిల్లాలో 61 వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల హవా కొనసాగింది. మొత్తం మీద 50 వార్డులు ఏకగ్రీవం కాగా అందులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 43 స్థానాలు కైవసం చేసుకుంది. టీడీపీ 7 స్థానాలకే పరిమితమైంది. మిగిలిన 11 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించగా, 6 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేయగా, 5 స్థానాల్లో మాత్రమే టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు.

చెర్లోయడవల్లి సర్పంచ్ ఏకగ్రీవం



జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా అందులో ఆత్మకూరు నియోజకవర్గంలోని చెర్లోయడవల్లిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు చేరెడ్డి ప్రభావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలం లింగరాజు అగ్రహారం సర్పంచ్ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా, అక్కడ జరిగిన ముక్కోణపు పోటీలో టీడీపీ మద్దతుదారుడు మంగళ తిరుమల విజయం సాధించారు.

- ఆత్మకూరు నియోజకవర్గంలో ఒక సర్పంచ్ స్థానంతోపాటు 11 వార్డు స్థానాలకు ఎన్నికల ప్రక్రియ జరగగా సర్పంచ్‌తోపాటు 10 వార్డులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సొంతం చేసుకున్నారు. టీడీపీ మద్దతుదారులు కేవలం ఒకే ఒక వార్డులో గెలుపొందారు.
- ఉదయగిరి నియోజకవర్గంలో ఒక సర్పంచ్‌తోపాటు 15 వార్డు స్థానాలకు జరిగిన ముక్కోణపు పోటీలో టీడీపీ మద్దతుదారుడు సర్పంచ్‌గా గెలుపొందారు. అలాగే 15 వార్డులకు గాను 8 వార్డులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, 7 వార్డులు టీడీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు.
- సర్వేపల్లి నియోజకవర్గంలో 12 వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు. టీడీపీ ఎక్కడా పోటీ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.
- కోవూరు నియోజకవర్గంలో 9 వార్డులకు గాను 7 వార్డులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సొంతం చేసుకోగా, రెండు స్థానాలను మాత్రమే టీడీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు.
- వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో 6 వార్డుల్లో 5 వార్డులను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సొంతం చేసుకోగా, టీడీపీ మద్దతుదారులు ఒక వార్డుకే పరిమితమయ్యారు.
- కందుకూరు నియోజకవర్గంలో 5 వార్డులకు గాను 3 వార్డులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కైవసం చేసుకోగా, రెండు వార్డులు మాత్రమే టీడీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు.
- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 2 వార్డులనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సొంతం చేసుకున్నారు.
- కావలి నియోజకవర్గంలో ఒక వార్డుకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు గెలుపొందాడు.

మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదే

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

వింజమూరు(ఉదయగిరి): 2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, రెండోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. వింజమూరులో ఆదివారం జరిగిన సొసైటీ నూతన అధ్యక్షుడు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి ప్రమాణ స్వీకార సభలో జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడారు. జాతీయ సర్వే సంస్థలు నిర్వహించిన ఎన్నికల సర్వేలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు చేస్తున్న మేలే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీరామరక్ష అని అన్నారు. దేశంలో ఏ సీఎం చేయనివిధంగా సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు.

ఎస్సైల బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న, వీఆర్‌లో ఉన్న ఆరుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాపూరు ఎస్సై వై.రంగనాథ్‌గౌడ్‌ను కోవూరుకు, దర్గామిట్ట ఎస్సై ఎం.బాజిబాబును లింగసముద్రానికి, వీఆర్‌లో ఉన్న ఎల్.సుధీర్‌కుమార్‌ను చిన్నబజారుకు, ఆర్.స్వామిశ్రీనివాస్‌ను వేదాయపాళేనికి, నవాబుపేట ఎస్సై జి.వీరేంద్రబాబును ఇందుకూరుపేటకు, అక్కడ పనిచేస్తున్న ఎం.రాజకుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

కొత్త ఊళ్లు వస్తున్నాయ్



ఆత్మకూరు మున్సిపాలిటీ సమీపంలో ఇళ్ల నిర్మాణాలతో కొత్త ఊరిని తలపిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీ

- వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో అర్హులందరికీ ఇళ్లు
- నెరవేరనున్న సామాన్యుడి సొంతింటి కల
- పట్టణ ప్రాంతాల్లో 60 శాతం పనులు
- గ్రామీణ ప్రాంతాల్లోనూ జరుగుతున్న నిర్మాణ పనులు
- డిసెంబర్ లోపు పూర్తి చేసేలా ప్రణాళికలు

జిల్లాలోని పలు రెవెన్యూ డివిజన్ కేంద్రాలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల సమీపంలో త్వరలో కొత్త ఊళ్లు వస్తున్నాయి. వినేందుకు వింతగా ఉన్నా ఇది నిజం. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే నవరత్నాల పథకాల్లో భాగంగా పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారు. లేఅవుట్లు ఏర్పాటు చేసి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు నిర్మిస్తుండడంతో పలుచోట్ల కొత్త ఊళ్లు ఏర్పడుతున్నాయి.

ఆత్మకూరు: గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పేదలకు సొంతిల్లు ఏర్పాటు చేస్తామని చెప్పిన నేతలు ఆ హామీని నెరవేర్చలేకపోవడంతో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. తాము ఇక సొంతిల్లు ఏర్పాటు చేసుకోలేమని పేదలు దిగాలు పడుతున్న తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టారు. సామాన్యుడి సొంతింటి కల నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తొలుత అర్బన్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కేటాయించడంతోపాటు స్థలాలు లేనిచోట కొనుగోలు చేసి వాటిని చదును చేసి అర్హులైన వారికి 6 అంకణాల(ఒక సెంటు) చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. గతేడాది ఉగాది నుంచి ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి కాంట్రాక్టర్ ద్వారా ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు 9 అంకణాల చొప్పున ఇళ్ల స్థలాలు అందించి ఇళ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

అడుగడుగునా అండగా..

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున నాలుగు విడతలుగా గృహ నిర్మాణశాఖ ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తోంది. తొలుత ప్రభుత్వం అందించిన నగదుతోనే పలువురు ఇల్లు నిర్మించుకున్నారు. అయితే ఇటీవల పెరిగిన నిర్మాణ వ్యయంతో కొందరు లబ్ధిదారులు తమ సొంత నగదును వెచ్చించి ప్రభుత్వ ఆర్థికసాయాన్ని అందిపుచ్చుకొని సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారు. పొదుపు మహిళలకు వడ్డీలేని రుణం రూ.35 వేల చొప్పున మెప్మా అధికారులు, సిబ్బంది తక్షణమే మంజూరు చేయిస్తుండడంతో పలువురు నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నారు. దీంతో పలు పట్టణాలు, మున్సిపాలిటీల పరిధిలో ఇళ్ల నిర్మాణ పనులు దాదాపు 60 శాతం పూర్తయిన నేపథ్యంలో ఆ కాలనీలను ఒక్కసారి పరిశీలిస్తే కొత్త ఊళ్లు ఏర్పడుతున్న విషయం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. పట్టణాలు, మున్సిపాలిటీలకు సమీపంలోనే అన్ని వసతులతో వైఎస్సార్ జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మిస్తుండడంతో ఆయా ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా మంజూరైన ఇళ్లు

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు
ఆత్మకూరు	8,844
కోవూరు	10,267
నెల్లూరురూరల్	10,234
నెల్లూరు సిటీ	9,193
సర్వేపల్లి	20,979
కావలి	13,212
ఉదయగిరి	7,049
కందుకూరు	6,344
మొత్తం	86,122

అధికారుల నిరంతర పర్యవేక్షణ

జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో మొత్తం 86,122 ఇళ్లు మంజూరైనట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. ఇందులో వివిధ ప్రాంతాల్లో సుమారు 24 వేల ఇళ్ల నిర్మాణాలు కాంట్రాక్టర్ల ద్వారా పూర్తి కావస్తున్నాయి. ఇళ్ల నిర్మాణ పనుల్లో రాజీలేకుండా నాణ్యతగా నిర్మించేలా గృహ నిర్మాణశాఖ అధికారులు, మున్సిపల్, నగరపాలక సంస్థల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

మౌలిక వసతుల కల్పన

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. కాలనీల్లో విద్యుత్ సౌకర్యం, వీధిదీపాల ఏర్పాటు, ఇసుక డంపింగ్ కేంద్రాలతోపాటు కాలనీల సమీపంలోనే సిమెంటు గోడౌన్లు ఏర్పాటు చేసి గృహ నిర్మాణశాఖ అధికారులు లబ్ధిదారులకు సిమెంటు అక్కడే అందజేస్తున్నారు. దీంతో నిర్మాణ పనులకు ఇబ్బందులు తలెత్తకుండా సమయం ఆదా అవుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు.

అర్హతే ప్రామాణికం

అర్హులైన వారు ఇంటి కోసం సచివాలయాల్లో నమోదు చేసుకుంటే పరిశీలించి వారికి ఇల్లు మంజూరు చేస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ అధికారులు తెలిపారు. దీంతో ఒక్కొక్క నియోజకవర్గంలో ఇళ్ల మంజూరు సంఖ్య నెలకోమారు పెరుగుతుంటుందని తెలిపారు.

వేగంగా ఇళ్ల పనులు చేయిస్తున్నాం

కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా చేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. తొలుత అర్బన్ ప్రాంతంలో నిర్మాణ పనులు ప్రారంభమై సుమారు 60 శాతం పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లోనూ నిర్మాణ పనులు మొదలుపెట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో వాటిపై దృష్టి కేంద్రీకరించి వర్క్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించేలా ఆదేశాలు ఇచ్చాం.

– నటరాజ్, డీఈఈ, గృహ నిర్మాణశాఖ, ఆత్మకూరు

ఇల్లు కట్టుకున్నాం



నా భర్త ప్రైవేట్ ఉద్యోగి. మాకు ఇద్దరు ఆడపిల్లలు. సొంతిల్లు లేదు. సొంతిల్లు కట్టుకొనే స్థోమతలేని పరిస్థితుల్లో వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. ప్రభుత్వ సాయం, మెప్మా రుణం అందడంతో ఇల్లు నిర్మించుకున్నా. త్వరలో గృహ ప్రవేశం చేస్తాం.

– షేక్ ఫర్జానా, ఇంటి లబ్ధిదారు, ఆత్మకూరు

నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చేస్తున్నాం



మున్సిపల్ పరిధిలో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా లబ్ధిదారులకు కావాల్సిన మేర నీరు, విద్యుత్ వసతులు కల్పించాం. కొన్ని ఇళ్ల నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల ద్వారా జరుగుతుండడంతో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా వారికి ఆదేశాలు ఇచ్చాం.

– బి.నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం



చెక్కు అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

మనుబోలు: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులైన గిరిజనులకు మనుబోలులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం మంత్రి చేతులమీదుగా రూ.15 వేల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాధారణంగా ఇళ్ల లబ్ధిదారులు పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉండడం వల్ల వారికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తోడు రూ.35 వేల రుణంగా అందుతుందని, దీంతో వారికి మొత్తం రూ.2.15 లక్షలు ఇంటి నిర్మాణానికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. అయితే గిరిజనుల్లో ఎక్కువ మంది పొదుపు సంఘాల్లో ఉండరని, అందుకే వారికి అదనంగా రూ.15 వేల సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సర్వేపల్లి నియోజకవర్గంలో 1,199 మంది గిరిజనులకు రూ.15 వేల చొప్పున చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఇంకా గిరిజనులు ఎంతమంది ఉన్నా సాయం అందిస్తామని తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే టీడీపీ పని

రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఏ అభివృద్ధి పని మొదలుపెట్టినా వెంటనే కోర్టులకు వెళ్లి దాన్ని అడ్డుకోవడం టీడీపీకి ఆనవాయితీగా మారిందన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు వరకు వెళ్లి పేదలకు అందే సాయాన్ని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ పేదల కోసం ఏమీచేయని చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచి పనులు చేస్తుంటే చూసి ఓర్వలేకున్నారన్నారు.

శిక్షలతో నేరాల కట్టడి

- గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు



ఫాస్ట్‌ట్రాక్ కేసులపై సమీక్ష నిర్వహిస్తున్న ఐజీ

నెల్లూరు(క్రైమ్): సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు శిక్షలు పడేలా చేయడం ద్వారా నేరాలను కట్టడి చేయవచ్చని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు పోలీసు అధికారులకు సూచించారు. ఆదివారం స్థానిక ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఫాస్ట్‌ట్రాక్ కేసులపై ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డితో కలిసి ఆయన జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫాస్ట్‌ట్రాక్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు, ట్రయల్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ డీజీపీ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో భాగంగా ఫాస్ట్ ట్రాక్ కేసులు కోర్టులో ట్రయల్‌కు వచ్చి కన్విక్షన్ పడేంతవరకూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. హత్య, గంజాయి, రేప్, పోక్సో కేసుల్లోని నిందితులపై రౌడీషీట్లు, సస్పెక్టెడ్ షీట్లు తప్పనిసరిగా ఓపెన్ చేయాలని ఆదేశించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేరాలను అదుపు చేసేందుకు బేసిక్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ ద్వారా కన్విక్షన్ శాతం పెంచుతామన్నారు. సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 20.045 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 673 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

విద్యుత్ సరఫరా.. నిరంతరాయం

- విద్యుత్ పంపిణీలో కీలకం ట్రాన్స్‌ఫార్మర్లు
- జిల్లాలో అదనంగా రెండు వేలు సిద్ధం
- ఎక్కడైనా మరమ్మతులకు గురైతే గంటల వ్యవధిలో మార్పు





విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సరఫరాలో ట్రాన్స్‌ఫార్మర్ కీలకం. ఇది విద్యుత్ సరఫరాకు గుండెలా పనిచేస్తుంది. జల, థర్మల్, పవన, సోలార్ వనరుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను నేరుగా వినియోగదారులకు అందించే వీలుండదు. తొలుత సబ్ స్టేషన్లు, అక్కడి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తారు. విద్యుత్ పంపిణీలో ప్రధాన భూమిక పోషిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, మరమ్మతులు, సరఫరా కోసం విద్యుత్ సంస్థలో ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్స్ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

గతంలోని పరిస్థితి ఇదీ

గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వారాల తరబడి రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో సాగునీరు లేక కళ్ల ముందే రైతులు పంటలు ఎండబెట్టుకున్న సందర్భాలు ఉండేవి. ఇదంతా గత ప్రభుత్వ హయాంలోనే. ప్రస్తుతం సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ సంస్థలకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో రైతులతో పాటు వినియోగదారులు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా ఇబ్బందులు పడకుండా విద్యుత్ సంస్థ యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యుత్ సరఫరాకు ప్రధాన వాహకంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు నగర ప్రాంతాల్లో మరమ్మతులకు గురైతే గంటల వ్యవధిలోనే కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే 24 గంటల వ్యవధిలోపు కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. రైతులు, ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా రెండు వేలకు పైగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచారు.

మరమ్మతులకు కారణాలు ఇవే..

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అధిక లోడ్ కారణంగా ఎక్కువగా మరమ్మతులకు గురవుతుంటాయి. ఏదైనా ఒక ప్రాంతంలో విద్యుత్ వినియోగం మేరకు లోడ్ కెపాసిటి కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. అయితే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం పెరగడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ లోపలి రాగి వైర్ కాలిపోతుంది. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ సైతం లీక్ అవుతుంటుంది. ఈ కారణంగా వేసవిలో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతుంటాయి.

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ ఖర్చు ఎక్కువే

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు కోసం విద్యుత్ సంస్థలు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ.3 లక్షలకుపైగా ఉండగా, 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.2 లక్షలకు పైగా వెచ్చించాల్సి ఉంటుంది. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే బాగుచేసేందుకు రూ.18 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం

విద్యుత్ పంపిణీలో కీలకమైన ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇద్దరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ముగ్గురు అసిస్టెంట్ ఇంజినీర్ల పర్యవేక్షణలో పదుల సంఖ్యలో కార్మికులు నిత్యం ప్రత్యేక షెడ్లలో ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేస్తుంటారు. వీరు ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టి సకాలంలో అధికారులకు అందించగలుగుతున్నారు.

వినియోగంలో 99,385 ట్రాన్స్‌ఫార్మర్లు

ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో 99,385 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగంలో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా గృహ అవసరాలు, రైతుల కోసం వినియోగించే 100 కేవీఏ, 63 కేవీఏ, 25కేవీఏ, 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 81,979 ఉన్నాయి. 15 కేవీఏ, 10 కేవీఏ, 5 కేవీఏ, 75 కేవీఏ, 50 కేవీఏ, 25 కేవీఏ, 50కేవీఏ, 74 కేవీఏ, 160 కేవీఏ, 200 కేవీఏ, 250 కేవీఏ, 315 కేవీఏ, 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 17,406 ఉన్నాయి. వీటికి అదనంగా మరో రెండు వేలకుపైగా ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచారు. వీటిని మరమ్మతులకు గురైన వాటి స్థానంలో వెంటనే ఏర్పాటు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టేందుకు జిల్లాసర్కిల్ పరిధిలో నెల్లూరు నగరంలోని కొత్తూరు, గూడూరు, కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లోని ప్రత్యేక షెడ్‌లలో బాగుచేసి తిరిగి వినియోగంలోకి తీసుకొస్తున్నారు. వీటితో పాటు నగరంలో మరో నాలుగు ప్రైవేట్ సంస్థలకు చెందిన షెడ్‌లలోనూ మరమ్మతులు చేస్తున్నారు.

జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత లేదు



ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఏ విద్యుత్ డివిజన్‌లోనూ ట్రాన్స్‌ఫార్మర్ల కొరత లేదు. గతంలో మాదిరిగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వినియోగదారులు, రైతులు ఎదురు చూసే రోజులు నేడు పోయాయి. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే గంటల వ్యవధిలో కొత్తది ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా చూస్తున్నాం.

–వెంకటసుబ్బయ్య, ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్

రెండు వేల ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం



జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వాటి స్థానంలో ఏర్పాటు చేసేందుకు అదనంగా రెండు వేలు అందుబాటులో ఉంచాం. వేసవిలో నెలకు 700కుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇతర కాలాల్లో నెలకు 400 నుంచి 500 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిని విద్యుత్ సంస్థకు చెందిన నాలుగు ప్రత్యేక షెడ్లతో పాటు మరో నాలుగు ప్రైవేటు షెడ్లలో బాగుచేస్తున్నాం.

–మధుసూదన్‌రెడ్డి, ఈఈ, ట్రాన్స్‌ఫార్మర్స్ విభాగం

రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి లేదు



గతంలో పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కొత్తది ఏర్పాటు చేసేందుకు వారం రోజులకుపైగా పట్టేది. అప్పట్లో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులే సబ్‌స్టేషన్‌కు తీసుకుకెళ్లి ఇస్తే కొత్తది ఇచ్చే వారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కరెంటోళ్ల కోసం రోజుల తరబడి సబ్‌స్టేషన్ చుట్టూ తిరిగే వాళ్లం. కానీ నేడు కరెంటోళ్లే మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లి ఒక్కరోజు వ్యవధిలోనే కొత్తది ఏర్పాటు చేస్తున్నారు.

–కోటంరెడ్డి పుల్లారెడ్డి, రైతు, వెన్నవాడ, ఆత్మకూరు మండలం

గంటల వ్యవధిలోనే ట్రాన్స్‌ఫార్మర్ మార్పు



గతంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలిసేది కాదు. కరెంటోళ్లకు ఫోన్ చేసినా ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు రోజుల తరబడి పట్టేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే గంటల వ్యవధిలోనే కొత్తది ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. విద్యుత్ శాఖ సేవలు ఎంతో మెరుగ్గా ఉన్నాయి.

–నరసారెడ్డి, గృహ వినియోగదారుడు, నెల్లూరు

మినీలారీ బోల్తా



జాతీయ రహదారిపై బోల్తా పడిన మినీలారీ

వెంకటాచలం: మండలంలోని చవటపాళెం సమీపంలో ఆదివారం జాతీయ రహదారిపై మినీలారీ అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు..గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ చవటపాళెం పంచాయతీ సమీపానికి చేరుకోగానే టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై బోల్తా పడిన మినీలారీని పోలీసులు క్రేన్ సాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ లైవ్ : రూ.134
లేయర్ లైవ్ : రూ.105
బ్రాయిలర్ చికెన్ : రూ.232
స్కిన్‌లెస్ చికెన్ : రూ.258
లేయర్ చికెన్ : రూ.178

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ. 37
సన్నవి : రూ. 20
పండు : రూ. 7



వైఎస్సార్‌సీపీని ఆదరించాలి

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 18వ డివిజన్‌లో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రెయిన్ల పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ ఇప్పటికే 18వ డివిజన్‌లో రూ.4.46 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ప్రజల అవసరాల మేరకు మరిన్ని నిధుల కేటాయింపునకు కృషి చేస్తామన్నారు.రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ అశోక్, నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

పోలంరెడ్డికి పరాభవం

- విడవలూరు పర్యటనలో కనిపించని టీడీపీ శ్రేణులు
- అసహనానికి గురైన పోలంరెడ్డి



రామతీర్థంలో పోలంరెడ్డి పర్యటనకు స్వల్పంగా హాజరైన టీడీపీ శ్రేణులు

కోవూరు: కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు దినేష్‌రెడ్డికి పరాభవం ఎదురైంది. కోవూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా శని, ఆదివారాల్లో విడవలూరు మండలం రామతీర్థం, దంపూరు గ్రామాలకు వెళ్లగా, వారి పర్యటనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు డుమ్మా కొట్టారు. దీంతో శ్రీనివాసులురెడ్డి తీవ్ర అసహనానికి గురయ్యారు. రామతీర్థంలో టీడీపీ నాయకుడి నివాసంలో ఏకంగా పోలంరెడ్డి సమక్షంలోనే నాయకులు సవాళ్లు,ప్రతి సవాళ్లు విసురుకున్నారు. మీ వల్లే పార్టీ నాశనమైందని కొందరు..మిమ్మల్ని, మీ పార్టీని నమ్ముకుని నాశనమయ్యామని మరికొందరు..ఇలా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఇకపై ఎవరైనా పార్టీలో చేరితే తనకు తెలియకుండా చేర్చుకోవడం కుదరదని పోలంరెడ్డి ప్రధాన అనుచరుడైన విడవలూరుకు చెందిన నాయకుడు హుకుం జారీ చేశారు. ఇదంతా శ్రీనివాసులురెడ్డి సమక్షంలోనే జరిగినప్పటికీ ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయాడు. కోవూరు నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా పోలంరెడ్డికి ఆదరణ కరువవడంతో వారు ఉనికిని కాపాడుకునేందుకు బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులను పిలిపించుకుని మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పార్టీ భవిష్యత్తు, తమ భవిష్యత్తు ఏమిటో అర్థం కాక వారి వెంట ఉన్న కొద్ది మంది నాయకులు లోలోన మథనపడుతున్నారు.

మత్స్యకార ద్రోహి పోలంరెడ్డి

అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులను పట్టించుకోకుండా అన్యాయం చేసిన ద్రోహి పోలంరెడ్డి అని వారు దుయ్యబట్టారు. సునామీ కష్టకాలంలో మత్స్యకార కుటుంబాలకు సాయంగా ఓ స్వచ్ఛంద సంస్థ అందజేసిన కోట్లాది రూపాయల నిధులను దిగమింగి మోసం చేశారని ఆరోపించారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని తీరప్రాంత గ్రామాలకు వస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహాయ సహకారాలతో తీరప్రాంత గ్రామాల ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు.

సాయిరాం హాస్పిటల్ నూతన భవన ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న వైద్యుల తల్లిదండ్రులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని శ్రీహరినగర్‌లో నిర్మించిన సాయిరాం హాస్పిటల్ నూతన భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రముఖ యూరాలజిస్ట్ సతీష్‌కుమార్‌రెడ్డి, గైనకాలజిస్ట్ లలితషిర్డీషా వారి తల్లితండ్రులతో కలిసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ నూతన భవనంలో యూరాలజీకి సంబంధించిన లేజర్ ట్రీట్‌మెంట్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, డయాలసిస్ యూనిట్, ఐసీయూ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గైనకాలజీ విభాగానికి సంబంధించి కాన్పులు, గర్భకోశ వ్యాధులతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సాఫల్యత చికిత్సా కేంద్రం(ఐవీఎఫ్)ను అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. వీటితో పాటు 24గంటలు డ్యూటీ డాక్టర్లు, ఫార్మసీ, ల్యాబ్ సౌకర్యాలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సోహన్‌ప్రభాత్ రెడ్డి, సాత్విక, సూర్యనారాయణరెడ్డి, సరస్వతమ్మ, శివ కుమార్‌రెడ్డి, ప్రఫుల్లాదేవితో పాటు నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.